

# అనగనగా ఓ నాన్న

## మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**మళ్ళీ ఫోన్ మోగింది.** ఆయన దాన్ని ఆన్సర్ చేస్తూంటే సృజన ముందు గదిలోకి వచ్చి దాన్ని భర్త చేతిలోంచి అందుకుని 'వీళ్ళతో మాట్లాడటానికి ఇది సరైన టైం కాదు' అని భర్తతో చెప్పి 'నేను మీకు మళ్ళీ ఫోన్ చేస్తాను' అని ఫోన్‌లో చెప్పి లైన్ కట్ చేసి త్రివిక్రంకి చెప్పసాగింది.

"జరిగింది నేను చెప్తాను విను బాబు. ప్రమీల ఎవరో కాదు. స్వయానా నా అక్కయ్య. మా వారు, అంటే అప్పుడు మా బావగారు, ప్రమీల ఓ జవరిలో హైదరాబాద్ బంధువుల ఇంటికి వచ్చినప్పుడు ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి వెళ్ళారు. అక్కడ రద్దీలో ఇద్దరూ తప్పిపోయారు. అప్పటికే రాత్రి పదకొండు దాటింది. బస్సులు కిటకిటలాడుతూ ఉండడంతో మా అక్క ఆటోలో ఇంటికి బయలుదేరింది. ఆటో పబ్లిక్ గార్డెన్స్ ప్రాంతానికి చేరగానే నలుగురు ఆటోని ఆపారు. ఇద్దరు వెనక, ఇద్దరు ముందు కూర్చుని దాన్ని తెరిచి ఉన్న గేటులోంచి గార్డెన్‌లోకి పోనిచ్చారు. అక్కడ మా అక్కయ్యని ఆ నలుగురు కలిసి రేప్ చేసారు" బాధగా చెప్పింది సృజన.

"గాడ్! హైదరాబాద్‌లోనే?"

"అవును. అదీ అసెంబ్లీ సమీపంలోనే. ఈలోగా ఆటో డ్రైవర్ పరిగెత్తుకెళ్ళి కొందర్ని పిల్చుకు వచ్చాడు. ఒకతను స్కూటర్ మీద నాంపల్లి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి ఆ నేరం గురించి ఫిర్యాదు చేసాడు. పోలీసులు వచ్చేసరికి వారు పారిపోయారు. పోలీసులు అక్కయ్యని ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించారు. ఆ నేరస్థల్లోని ఒకతని బస్ పాస్ అక్కడ దొరికింది. దాని ఆధారంతో పోలీసులు మర్నాడు ఆ నలుగురిని పట్టుకున్నారు. ఆబిడ్స్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటూ ఆ నలుగురు బి.ఏ మొదటి సంవత్సరం చదువుతున్నారు. ఆ రోజు వారిలో ఒకతని బర్త్‌డే కాబట్టి నాంపల్లిలోని ఓ బార్‌లో పార్టీ చేసుకుని తాగారు. ఆ మత్తులో వాళ్ళు ఆడవాళ్ళు వెళ్ళే ఒకటి రెండు ఆటోలని ఆపాలని ప్రయత్నించారు. కానీ డ్రైవర్లు ఆపలేదు. మా అక్క వెళ్ళే ఆటో డ్రైవర్ మాత్రం ఆపాడు."

బాధగా వింటున్నాడు త్రివిక్రం.

"ఆ నలుగుర్ని మర్నాడు ఉస్మానియా హాస్పిటల్‌కి తీసుకెళ్ళి పోలీసులు పరీక్ష చేయించి వాళ్ళు నలుగురూ రేప్ చేసారని నిర్ధారణకి వచ్చారు. వాళ్ళందరి ఒంటిమీద అక్క రక్కిన రక్కులు ఉన్నాయి. ఆ కేసు ఆ రోజుల్లో సెన్సేషన్ అయింది. దిన పత్రికలన్నిటిలో ఆ వార్తలు వచ్చాయి. వారిలో ఒకడి తండ్రి పోలీస్ శాఖలో పెద్ద ఉద్యోగంలో ఉన్నాడు. మరొకడు పెద్ద ఇండస్ట్రియలిస్ట్. ఫలితంగా వాళ్ళు శిక్షనుంచి తప్పించుకోగలిగారు. తమ మిత్రులిద్దర్నీ ఆ చెడు పని నించి విరమింప చేయడానికి చేసిన ప్రయత్నం వల్ల వారిద్దరి ఒంటిమీద గాయాలయ్యాయని వారి డిఫెన్స్ లాయర్స్ వాదించారు. పోలీస్ అధికారి కరీంనగర్‌నించి హైదరాబాద్‌కి బదిలీ చేయించుకుని వచ్చి ఇక్కడ ఉండి తన కొడుకుని రక్షించుకున్నాడు. ఇండస్ట్రియలిస్ట్ చాలా డబ్బు ఖర్చు చేసి తన కొడుకుని రక్షించుకున్నాడు. మిగిలిన ఇద్దరూ సామాన్యులు కాబట్టి వాళ్ళకి శిక్ష పడింది. ఆ ఇద్దరూ హైకోర్టుకి అపీల్ చేసారు. హైకోర్టులో ఒకరికి మాత్రమే శిక్షపడి, రెండో అతన్ని నిర్దోషిగా భావించి విడుదల చేసారు."

"దారుణం"

"ప్రమీల మా బావగారికి చెప్పింది నలుగురు తనని రేప్ చేసారని. ఆ తర్వాత ఒకసారి అర్ధరాత్రి గ్యాస్‌స్టవ్‌ని ఆన్ చేసి వంట గది తలుపులు, కిటికీలు వేసుకుంది. కానీ బావగారు సమయానికి బాత్‌రూమ్‌కి వెళ్ళడానికి లేవడంతో గేస్ వాసన వేసి వెళ్ళి చూస్తే తలుపు లోపల గడియపెట్టి ఉండటం గమనించి దాన్ని పగలకొట్టారు."

"అది చెక్క తలుపు కాదు. కార్డ్ బోర్డ్ ప్లాంక్‌తో చేసిన తలుపు" చెప్పాడు విశ్వేశ్వరరావు.

"ఆ సమయంలో ఫ్రెండైన మీ అమ్మ జనని ప్రమీలకి మానసికంగా ఎంతో ఊరటగా నిలిచింది. ఢిల్లీలో ఉన్నా జరిగింది తెలిసి తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ, టెలిగ్రాంలు పంపుతూ, పెద్ద ఉత్తరాలు రాస్తూ, మధ్య మధ్యలో వచ్చి వెళ్తూ, ఈ రోజు మనం కౌన్సిలింగ్ అనే మాటని ఉపయోగిస్తున్నాం. ఆ పని చేసి బాసటగా నిలిచింది."

"మీ అమ్మ ఎవరినైనా ఏ విషయంలోనైనా తేలిగ్గా నచ్చచెప్పగలదు. నేనంటూండేవాడిని ఆవిడ 'లా' చదివి ఉంటే గొప్ప లాయర్‌గా పేరు తెచ్చుకునేదని." నవ్వుతూ చెప్పాడు విశ్వేశ్వరరావు.

"తను గర్భవతి అయ్యానని తెలుసుకోగానే ప్రమీల ఇక ఆత్మహత్య ప్రయత్నం చేయలేదు. పదినెలల తర్వాత నువ్వు పుట్టావు. మా వారు నిన్ను అనాథాశ్రమంలో ఇద్దామనుకున్నారు. అది తెలిసి పసికందైన నిన్ను అక్కనించి జనని తీసేసుకుంది."

త్రివిక్రం బాధగా కళ్ళు మూసుకున్నాడు. కొద్ది క్షణాలు ఆ గదిలో పూర్తి నిశ్శబ్దం. తర్వాత త్రివిక్రం కళ్ళు తెరిచి అడిగాడు.

"అయితే నా తండ్రి ఎవరు?"

"బలత్కారం చేసిన ఆ నలుగురిలో ఒకరు. ఎవరన్నది ఎవరికీ తెలీదు."

"ఛ!" త్రివిక్రం మరోసారి బాధగా మూలిగాడు.

అతనికి ఒక్కసారిగా తన బతుకంతా అంధకారమైందన్న భావన కలిగింది. తను అనాథ. బయోలాజికల్ తల్లి లేదు. బయోలాజికల్ తండ్రి ఎవరో తెలీదు. ఎవరైనా అతను కాముకుడు.

"దట్స్ టెరిబుల్" చెప్పాడు.

"ఒకవేళ బ్రతికున్నా మా అక్క కూడా నీ తండ్రి ఎవరనేది చెప్పలేదు. ఆ సంఘటనతో మా అక్క మానసికంగా బాగా కృంగిపోయింది. నువ్వు పుట్టిన ఏడాది తిరక్కుండానే జలోదరంతో పోయింది. లివర్ పాడైందని డిటెక్ట్ అయిన ఆరు నెలలు తిరక్కుండానే పోయింది."

త్రివిక్రం మరోసారి బాధగా మూలిగాడు. "అందుకే ఇందాక అన్నాను నువ్వు నీ గతం గురించి తెలుసుకోకుండా ఉంటేనే బావుంటుందని" విశ్వేశ్వరరావు తప్పంతా త్రివిక్రందే అన్నట్లుగా చెప్పాడు.

"నా పుట్టుకకి వెనక ఇంత ఘోరం ఉందని నాకు తెలీదు"

"నీకీ విషయం ఎప్పటికీ తెలియనివ్వకూడదని మీ అమ్మానాన్నలు అనుకున్నారు. అందుకే మా దగ్గరకి రావడం మానేసారు నువ్వు దత్తతకి వచ్చావంటే పెద్దయ్యాక నీ అసలు తల్లిదండ్రులగురించి అడగచ్చని భావించి తమ చుట్టాలందరికీ నువ్వు తనకి సహజంగానే పుట్టావని మీ అమ్మ చెప్పింది. వాళ్ళు ఢిల్లీలో ఉండటం అందుకు అడ్వాంటేజ్ అయింది. మేం ఎవరికీ చెప్పలేదా విషయం. అది మాతోనే అంతరించి పోతుందనుకున్నాం. నా కళాకృతుల ఇంటర్వ్యూద్వారా విధి మనం కలిసేలా చేసింది" చెప్పింది సృజన.

"మరి ఎదుర్లంకలోని మీ నాన్నగారికి ఈ విషయాలు తెలియవా?"

"తెలుసు. ఆయనకి నువ్వు ఓ విధంగా మనవడివే కూడా. నువ్వు బాధపడకూడదని నీకాయన ఆ విషయాలేం చెప్పలేదు."

"ఆయన చెప్పి ఉంటే ఈ విషయం అక్కడే తెలిసేదన్నమాట?"

"అవును. అందుకే నువ్వు మమ్మల్ని కలుసుకోకూడదని మా చిరునామా కూడా తెలీదని చెప్పారు" చెప్పాడు విశ్వేశ్వరరావు.

"మీ నాన్నగారు చెప్పకపోవటం సరే కానీ సృజన పేరు చెపితే మీ ఇంటికి దారి చూపించినతను తెలీదన్నాడే? మీ వివాహం గురించి ఆ గ్రామస్థులకి తెలీదా? అడిగాడు త్రివిక్రం.

చిన్నగా నవ్వింది సృజన.

"తెలుసు. కానీ మీకే మా ఊరి వాళ్ళ గురించి తెలీదు. ఎవరూ ఎవరికీ ఎవరి గురించిన ఏ సమాచారం వారి అనుమతి లేకుండా చెప్పరు. తెలీనట్లే నటిస్తారు. అది వాళ్ళకి తరతరాలుగా వస్తున్న జాగ్రత్త."

"ఓ?!"

"మా ఎదురింటి తలుపు కొట్టి మా గురించి అడిగితే 'నాకు తెలీదండి. ఎప్పుడూ ఆపేరే వినలేదు' అంటారు తప్ప చెప్పరు. అది ఆ ప్రాంతం సంస్కారం" మళ్ళీ నవ్వింది సృజన.

మరోసారి సెల్‌ఫోన్ మోగింది. దాన్ని సృజన సైలెంట్ మోడ్‌లోకి మార్చేసింది.

"ఇంతకీ ఆ నలుగురు నేరస్థుల గురించి మీరు నాకు పూర్తిగా చెప్పనేలేదు?"

"మా దగ్గర ఆ వివరాలేం లేవు" చెప్పాడు విశ్వేశ్వరరావు.

"1980 ఫిబ్రవరి 7న జరిగిందా దుర్ఘటన. ఫిబ్రవరి 8నించి పేపర్లని సంపాదించి చదివితే నీకు అన్ని విషయాలు వివరంగా తెలుస్తాయి" చెప్పింది సృజన.

"ఇది మంచి సలహా. థాంక్స్" చెప్పాడు త్రివిక్రం.

తర్వాత చిన్నగా తలపంకించి లేస్తూ చెప్పాడు.

"థాంక్స్ ఫర్ యువర్ టైం."

"ఏది ఏమైనా నువ్వు ఇలా ఎంక్వైరీ చేసుకుంటూ మాదాకా రాకపోతే బావుండేది. నువ్వు మా నాన్నగారిని కలిసావని తెలిసాక మమ్మల్ని కలవడం విషయంలో బ్రేక్ పడితే బావుండును అనుకున్నాను" చెప్పింది సృజన.

గుమ్మం దాకా వెళ్ళాక అప్పుడే ఆ ఆలోచన కలిగినట్లుగా ఆగి వెనక్కి తిరిగి అడిగాడు.

"ప్రమీల.. ఐ మీన్ మా అమ్మ ఫోటో ఉంటే చూపిస్తారా?"

"అలాగే"

ఓ పాతకాలం బ్లాక్ అండ్ వైట్ ఫోటోలున్న ఆల్బంని తెచ్చింది సృజన. నల్లటి దళసరి కాగితాల మీద బంగారు రంగు కార్నర్స్ అతికించి ఉన్న ఫోటోలలో ప్రమీల కాలేజీ హాల్ టిక్కెట్ కోసం తీయించుకున్న ఫోటో, భర్తతో మ్యారేజ్ ఏనివర్సరీ రోజు తీయించుకున్న ఫోటో, మరి కొన్ని ఫోటోలు ఉన్నాయి.

"నేను ఒకటి తీసుకోవచ్చా?" అడిగాడు.

"ష్యూర్ రెండు తీసుకోండి. ఇవి చాలా ఉన్నాయి."

మూడిటిని సృజనే తీసిచ్చింది. వాటిని జేబులో ఉంచుకుని మరోసారి థాంక్స్ చెప్పి త్రివిక్రం గుమ్మం దగ్గరికి వచ్చాడు. సృజన చెప్పిందతనికి

"గుర్తుంచుకో. నువ్వు నాకు కొడుకు వరసవుతావు. నేను నీకు పిన్నిని."

త్రివిక్రం కారులో ఇంటికి చేరుకున్నా తను ఏ రూట్‌లో వచ్చాడూ, ఎలా డ్రైవ్ చేసాడూ అన్న స్పృహే లేదు. కారుని పార్క్ చేసి తమ ఫ్లాట్‌లోకి వెళ్ళాడు.

డోర్ బెల్ విని సుందరేశ్వర్ తలుపు తీసాడు. త్రివికరం పలకరించకుండా ఆయన్ని దాటుకుని తండ్రి గదిలోకి వెళ్ళి ఆయన పక్కన కూర్చున్నాడు. కొద్ది క్షణాల తర్వాత తండ్రిని ఆప్యాయంగా కౌగిలించుకున్నాడు.

"ఎవరు నువ్వు?" ఎప్పటిలా నిశ్చలంగా చూస్తూ అడిగాడాయన.

వణికే చేతులతో జేబులోంచి తన కన్న తల్లి ప్రమీల మూడు ఫోటోలని తీసి ఆయన కళ్ళముందు ఉంచాడు. మార్చి మార్చి వాటిని చూసిన రాం ప్రసాద్ మొహంలో ఎలాంటి మార్పూ లేదు.

"ఎవరీమె?" అడిగాడు.

వాటిని మళ్ళీ జేబులో పెట్టుకుని దీర్ఘంగా నిట్టూర్చి, త్రివిక్రం తండ్రి పక్కనించి లేచాడు.

"మీకు భోజనం డైనింగ్ టేబుల్ మీద సిద్ధంగా ఉంది" చెప్పాడు సుందరేశ్వర్.

తన గదిలోకి వెళ్ళిన త్రివిక్రం వెంటనే బయటికి వచ్చి సుందరేశ్వర్‌తో తనకి తెలిసిన ఆ కొత్త విషయాలని ఉద్వేగంగా చెప్పాడు. ప్రమీల ఫోటోలని చూపించాడు. ఆయనకి కూడా ఆ విషయాలు విని షాక్ తగిలినట్లయింది.

"అవును. ఇప్పుడు నేను తెలుసుకోవాల్సింది నా తండ్రి ఎవరన్నది?" స్థిరంగా చెప్పాడు త్రివిక్రం.

"ఎలా?"

"పాత దినపత్రికల్లో ఆ నలుగురు నేరస్థుల వివరాలు ఉంటాయి. వారిలో ఎవరన్నది తెలుసుకోవడం తేలిక. ఆధునిక విజ్ఞానం అందుకు ఉపయోగిస్తుంది."

"నిజమే. నలుగురిలో ఒకరు ఎవరన్నది తెలుసుకోవడం పెద్ద కష్టం కాకపోవచ్చు" చెప్పాడు సుందరేశ్వర్.

"లేదా ఇంకా కష్టంకావచ్చు."

త్రివిక్రంకి భోజనం చేయాలనిపించలేదు. తన గదిలోకి వెళ్ళి పడుకున్నాడు. కానీ వివిధ ఆలోచనలతో నిద్రపట్టలేదు. ఆ నలుగురిలో తన తండ్రి ఎవరైనా సరే, తను పుట్టింది ఓ కాముకుడికి కనీసం విపరీతమైన కాముకత్వ భావన ఆవరించి ఉన్న సమయంలోని ఒకరు తన తండ్రి అయ్యారు. ఆ ఆలోచనే అతనికి జుగుప్సగా అనిపించింది. నయం. తనకి తన తండ్రి కాముకత్వం రాలేదు.

లేచి ఇంటర్నెట్‌లోకి వెళ్ళి హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, డెక్కన్ క్రానికల్ దినపత్రికలని 1980 ఫిబ్రవరి సంచికల కోసం వెతికాడు. అంత పాతవి లేవు. మళ్ళీ పడుకున్నాడు. కానీ ఓ విధమైన మానసిక ఆందోళనతో అతనికి నిద్రపట్టలేదు. మళ్ళీ లేచి డాక్టర్ విరజ ఇచ్చిన దత్తతలకి సంబంధించిన వాస్తవ గాథల పుస్తకాన్ని తెరిచి పేజ్ ఇండికేటర్ చూసి తర్వాత కథని సగం చదివాడు. తర్వాత మనసు దానిమీద నిలవక ఆ పుస్తకాన్ని మూసేసాడు. రకరకాల ఆలోచనల మధ్య అతనికి ఆలస్యంగా నిద్రపట్టింది.

8

ఆ రోజు గాంధీ హాస్పిటల్‌లో త్రివిక్రం డ్యూటీ అవుట్ పేషెంట్ విభాగంలో పడింది.

ఆమె అతని పంతొమ్మిదో రోగి. అంతదాకా చూసిన మిగిలిన అందరి రోగుల్లా ఆమె కూడా బీద కుటుంబం నుంచి వచ్చిందని తెలిసిపోతోంది. స్టూల్ మీద కూర్చున్న ఆమె మొహంలోని సీతాకోక చిలుక ఆకారంలోని మచ్చని చూసాడు.

"ఏమిటి సమస్య?" అడిగాడు.

"తరచూ జ్వరం వస్తోంది డాక్టర్ గారూ. మందులకి తగ్గి మళ్ళీ మళ్ళీ వస్తోంది. ఇంటిపని చేసుకునే ఓపిక కూడా ఉండటం లేదు. "

ఆమె సమస్య ఏమిటో అప్పటికే త్రివిక్రంకి అర్ధమైంది.

"మొహం మీద ఈ మచ్చలు ఎప్పుడు వచ్చాయి?" అడిగాడు.

"చాలా సంవత్సరాలుగా ఉన్నాయి."

ఆమె చేతిని అందుకుని వేళ్ళని పరిశీలించాడు. చేతి వేళ్ళ కొసనగల నలుపు రంగుని చూసాడు.

"మొహం మీదే కాక శరీరం మీద ఇతతర చోట్ల కూడా ఆ మచ్చలు ఉన్నాయా?"

"ఉన్నాయి. విటమిన్ లోపం వల్ల అని ఓ డాక్టర్ చెప్పారు."

చిన్నగా నిట్టూర్చాడు. దేశంలో ఆ వ్యాధికి చెందిన డాక్టర్లు వందకి మించి లేరని, చాలామంది డాక్టర్లకి ఈ వ్యాధి గురించి పెద్దగా తెలీదని త్రివిక్రంకి తెలుసు.

"మీకు ల్యూపస్ అనే వ్యాధి వచ్చింది. ఇది శరీరంలో చాలాకాలం ఉండే ప్రమాదకరమైన వ్యాధి. దీనివల్ల రోగ నిరోధక శక్తి కుంటుపడుతుంది. అందువల్లే మీకు తరచు జ్వరం రావడం, నీరసం. ఇది అధికంగా ఆడవాళ్ళకే సోకే వ్యాధి. ఇది మీకు చర్మానికి సోకింది. కీళ్ళు, మూత్రపిండాలు, మెదడు వంటి భాగాలకి సోకే అవకాశం ఎక్కువగా ఉంది. ముందు చర్మ పరీక్షలు చేయించుకురండి. అది చూసి మందు రాస్తాను"

ల్యూపస్ బ్యాండ్ టెస్ట్‌ని ఆమెకి రాసిచ్చాడు త్రివిక్రం. మరికొందరు రోగులని చూసాక, ఆ రోజుకి త్రివిక్రంకి డ్యూటీ అయిపోయింది. త్రివిక్రం తర్వాత డ్యూటీ డాక్టర్ విరజ రాగానే ఆమెని విష్ చేసి చార్జ్ హేండోవర్ చేసి అతను లేచాడు.

"మీ తల్లి విషయం ఏదైనా తెలిసిందా?" అడిగింది విరజ.

త్రివిక్రంలో మొదటిసారిగా మీమాంస మొదలైంది. తన తల్లిని తాగి ఉన్న నలుగురు బలాత్కరిస్తే తను వారిలో ఒకరికి పుట్టానని చెప్పాలా, వద్దా? గతరాత్రి ఇంట్లో సుందరేశ్వర్ తనవాడనుకుని చెప్పాడు. కానీ బయట వారికి అంత ఫ్రీగా చెప్పడానికి అతని అహం అడ్డొచ్చింది. కొంతే చెప్పాడు.

"నా తల్లి ఎవరో తెలిసింది."

"కంగ్రాట్స్. ఎవరు?"

జేబులోంచి ఫోటో తీసి చూపించి చెప్పాడు.

"ఈమె పేరు ప్రమీల. మా అమ్మ ఫ్రెండ్ పెంపకానికి వచ్చాను."

"అరె! మీరు అచ్చం మీ అమ్మ పోలికే."

"అవునా?"

"స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా ముక్కూ, కళ్ళూ మీ అమ్మవే. ఇంతమంచి న్యూస్ ఇంత లేట్‌గానే చెప్పడం?"

"నిన్నరాత్రే నాకు ఈ సంగతి తెలిసింది."

హస్తకళల బొమ్మలద్వారా తను విశ్వేశ్వరరావు భార్య సృజనని ఎలా ట్రేస్ చేసాడో వివరించాడు.

"అయ్యో మీ అమ్మ పోయిందన్నమాట. వెరీ సారీ. మీ నాన్నగారు విశ్వేశ్వరరావు మిమ్మల్ని చూసి ఎలా ఫీలయ్యారు?"

"నేను మీకోటి చెప్పాలి. ఆయన కాదు మా నాన్నగారు."

అతని చెప్పింది విరజ ఆశ్చర్యంగా విన్నది.

"ఇది మీ అమ్మ రహస్యం కన్నా ఇంకా పరమ రహస్యం. నేను ఎవరికీ చెప్పను." సానుభూతిగా చూస్తూ చెప్పింది.

త్రివిక్రం హాస్పిటల్ నించి బయటకి వచ్చి కారులో సరాసరి అశోక్ నగర్‌లోని సిటీ సెంట్రల్ లైబ్రరీకి చేరుకున్నాడు. దాని ఆవరణలో కారు పార్క్ చేసి లోపలికి వెళ్ళి పాత దినపత్రికల సెక్షన్ ఎక్కడుందో కనుక్కుని ఆ విభాగంలోకి వెళ్ళాడు. గత రెండేళ్ళ దినపత్రికలు బైండ్ చేసి ఉన్నాయి.

పందొమ్మిది వందల ఎనభైకి చెందిన దినపత్రికలు లేవు. లైబ్రేరియన్‌ని అడిగితే చెప్పింది.

"మీకవి అఫ్జల్ గంజ్‌లోని లైబ్రరీలో దొరుకుతాయి. రాష్ట్రం మొత్తానికి అదే పెద్ద లైబ్రరీ."

"థాంక్స్."

ఆ రోజుకి టైం అయిపోవడంతో ఇంటికి వెళ్ళిపోయాడు. మర్నాడు నైట్ డ్యూటీ కాబట్టి ఉదయం లైబ్రరీకి వెళ్ళాలని అనుకున్నాడు.

ఆ రాత్రి ఇంటర్నెట్‌లో ల్యూపస్ వ్యాధి గురించి సెర్చ్ చేసి దానికి సంబంధించిన సమాచారం చదివాడు. చాలా రోజులుగా ఇంటర్నెట్‌లో ఛాటింగ్‌కి వెళ్ళలేదు. ఆ రాత్రి వెళితే బింబ్లీ లైన్‌లో ఉంది.

"హాయ్ స్ఫూర్తి" టైప్ చేసాడు.

"హాయ్ లాంగ్ టైమ్ నో సీ?"

"బిజీ"

"బాగా సంపాదించారన్నమాట? "

"లేదు. రోగులకి బాగా చికిత్స చేసాను."

"మీరు అబద్ధం ఆడటం లేదు కదా?"

"లేదు."

"అబద్ధమాడినా నేనది ఎటూ తెలుసుకోలేను."

"మనం ఓసారి వ్యక్తిగతంగా కలుద్దామా?" సందేహిస్తూనే అడిగాడు.

"అలాగే. ఎందుకు?"

"ఊరికే ఎప్పుడు? ఎక్కడ?" అడిగాడు.

"ఎక్కడన్నది ఆ రోజు డిసైడ్ చేద్దాం. మనిషి  చంద్రుడి మీద ఇల్లు కట్టిన రోజు కలుద్దాం."

"సారీ? అడిగాడు.

"ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రుడి మీద కాలుపెట్టాక మాట్లాడిన మొదటి మాటలు మనందరికీ తెలుసు. 'ఇట్స్ ఏ స్మాల్ స్టెప్. బట్ ఏ లాంగ్ వే ఫర్ ది మేన్‌కైండ్"

"అవును."

తర్వాత అతను అన్న మాటలు 'మా పక్కింటాయన, ఎదురింటావిడ ఇవాళ రాత్రి సెక్స్‌లో పాల్గొంటారు' అని.

"వాట్?"

"అవును. అవి ఆలస్యంగా బయటపడ్డాయి. నీ ఆర్మ్‌స్ట్రాంగ్ చిన్నప్పుడు ఓ రాత్రి పక్కింటాయనతో ఎదురింటావిడ చెప్పిన మాటలు విన్నాట్ట. 'నాతో సెక్సా? మనిషి చంద్రుడి మీద కాలుపెట్టిన రాత్రి రా' అని ఆవిడ అన్నదిట. అందుకని ఆ మాటన్నాడు."

"ఓ! జోకా? నిజం అనుకున్నాను"

"అలాగే మనిషి చంద్రుడి మీద ఇల్లుకట్టిన రాత్రి కలుద్దాం."

"నన్ను కలవనని జోక్‌ని ముడిపెట్టి చెప్తున్నారన్నమాట."

"ఇంటర్నెట్‌లో ఛాటింగ్ చేసే వారిని ఎవర్నీ కలవకూడదన్నది నా పాలసీ."

"బేడ్ పాలసీ"

"అవును లేకపోతే ప్రతీ రాత్రి డిన్నర్‌కి పిలిచేవారుంటారు. ఇక ఇంట్లో భోజనం చేయడం ఎప్పుడు?"

స్మైలీ బొమ్మ ఐకాన్ వాక్యం పక్కన ఉంది.

"నేను భోజనానికి పిలవడంలేదు. మీ గురించి చెప్పరాదు?"

"అన్నీ కలిసి పోస్ట్ కార్డ్‌లో రాయగలిగేంతే. ఉదయం ఆరుకి లేస్తాను. తొమ్మిదికి కాలేజీలో ఉంటాను. అయిదున్నరకి ఇంటికి చేరుకుంటాను. చదువుకుని పడుకుంటాను. ఆదివారాలు ఆలస్యంగా లేస్తాను. నేనేమైనా దేశం కోసం పోరాడానా? లేక ఏదైనా ఆటల్లో ఒలింపిక్స్‌కి వెళ్ళానా? నా గురించి చెప్పడానికి ప్రత్యేకంగా ఏం లేదు. మీ గురించి చెప్పండి."

"చెప్పాననుకుంటా? డాక్టర్‌ని. మా అమ్మ పోయింది. నాన్నకు అల్జీమర్స్. ఆలోచిస్తే నాగురించి కూడా నేను చెప్పగలిగేది పోస్ట్ కార్డ్‌లో పట్టేంతకి మించిలేదు."

"అయితే మీరుకూడా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడలేదన్నమాట. ఒలింపిక్స్‌కి వెళ్ళనట్లేగా"

"అవును"

"వాట్స్ న్యూ?"

"సెనెక్స్‌లో నలభై పాయింట్ల పతనం. అదీ కొత్త న్యూస్."

స్మైలీ బొమ్మ.

"సెన్సెక్స్ అంటే ఏమిటి?"

"అంటే షేర్లకి చెందింది. నాకూ పెద్దగా తెలీదు."

"నేను చెప్పనా?"

కొద్ది క్షణాల తర్వాత సెన్సెక్స్ గురించి నాలుగు పేరాలు వచ్చాయి. అంత తక్కువ టైంలో అన్ని పేరాలని స్ఫూర్తి టైప్ చేయలేదని, ఐది ఇంటర్నెట్‌లో సెర్చ్ చేసి కాపీ చేసి పంపిందని గ్రహించాడు త్రివిక్రం.

"ఇంటర్నెట్ వచ్చాక అడ్వాంటేజ్, ప్రపంచంలోని ఏ విషయం మీదైనా సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు."

"అవును. ప్రపంచంలోని మనకి అవసరంలేని ఏ విషయమైనా తెలుసుకోవచ్చు."

"నిజమే. అవసరం ఉన్నవి ఎటూ తెలుస్తూనే ఉంటాయి. కానీ నాలాంటి డాక్టర్స్‌కి వృత్తిపరంగా ఇంటర్నెట్ చాలా మేలు చేస్తుంది"

"ఓ.కే. టైం టు సైనాఫ్."

"బై"

"బై."

గతరాత్రి సరిగ్గా నిద్రపోక పోవడంతో ఆ రాత్రి త్రివిక్రంకి త్వరగా, గాఢంగా నిద్రపట్టేసింది.

మర్నాడు ఉదయం అఫ్జల్‌గంజ్ లైబ్రరీకి వెళ్ళబోయే ముందు ఓ మెడికో లీగల్ కేసు గురించి మాట్లాడడానికి లాయరాఫీస్‌కి వెళ్ళాడు త్రివిక్రం. బాగా వృద్ధుడైన ఆయన పేరు భాస్కరమూర్తి. ఆయనతో మాట్లాడి సరాసరి అఫ్జల్‌గంజ్ లైబ్రరీకి వెళ్ళాడు. ప్రభుత్వ

కార్యాలయాల్లో పనిచేసేవారు ఏదైనా పనిమీద తమ దగ్గరికి వచ్చిన వారికి ఎలా 'నో' చెప్పి పంపించేయాలా అని చూస్తారు. అలాంటి ఏటిట్యూడ్ గలవారే తనకి తారసపడతారని అనుకుని వెళ్ళిన త్రివిక్రంకి శ్చర్యంగా సహాయం చేసే లైబ్రేరియన్ తారసపడింది.

"నైన్టీన్ ఎయిటీ ఫిబ్రవరి నైన్త్ దినపత్రికలు కావాలా? ఒన్ సెకండ్"

కంప్యూటర్‌లో ఆమె ఏదో టైప్ చేసి కొద్దిసేపు అనేక కమాండ్స్ ఇచ్చి ఏదో సమాచారం చిన్న కాగితం మీద రాసిచ్చి చెప్పింది.

"డైలీ పేపర్స్ విభాగానికి వెళ్ళి ఈ కాగితం చూపించండి. మీ పనవుతుంది."

"థాంక్స్"

ఆ విభాగంలో పనిచేసే లైబ్రేరియన్ ఆ కాగితాన్ని చూసి చెప్పింది.

"దినపత్రికలన్నిటినీ స్కేన్ చేసి కంప్యూటర్‌లోకి ఎక్కించాం. కంప్యూటర్ ఆపరేట్ చేయడం వచ్చా మీకు?"

"వచ్చు."

"గుడ్" త్రివిక్రం సంతకాన్ని ఓ రిజిష్టర్‌లో తీసుకుంది.

"ఆ కంప్యూటర్‌లో ఈ ఫైల్‌ని తెరవండి అన్ని దినపత్రికలు కనపడతాయి."

ఆ కాగితం మళ్ళీ వెనక్కి ఇచ్చి చెప్పింది. త్రివిక్రం కంప్యూటర్‌ని ఆన్ చేసి ఆ ఫైల్‌ని తెరిచాడు.

ఆ ఫైల్‌లో ఆంధ్రజ్యోతి దినపత్రికలు ఉన్నాయి. డ్రాప్ డౌన్ పద్ధతిలో తొమ్మిది, పంతొమ్మిది వందల ఎనభైల పత్రికని ఎన్నిక చేసి 'గో' మీద క్లిక్ చేశాడు. ఆశ్చర్యంగా ఆ రోజు ఆంధ్రజ్యోతి స్క్రీన్ మీద ప్రత్యక్షం అయింది. అప్పటికింకా జిల్లా టాబ్లాయిడ్ ఎడిషన్స్ రాలేదు. మెయిన్ పేపర్లోనే అన్ని వార్తలు వేసారు. ఒక్కో పేజీని చదువుతూ త్రివిక్రం తనకి కావలసిన సమాచారం కోసం వెతకసాగాడు. నాలుగో పేజీలో ఉందా వార్త.

'నలుగురు కిరాతకుల చేతిలో అబల బలాత్కారం.'

వెంటనే ఆ వార్తని కొద్దిగా ఉత్కంఠగా చదివాడు. సృజన చెప్పిన విషయాలే ఆ వార్తలో ఉన్నాయి. గత రాత్రి ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌కి తన భర్త విశ్వేశ్వర్రావుతో వెళ్ళిన ప్రమీల అనే మహిళ ఎగ్జిబిషన్‌లో తప్పిపోవడంతో ఆటోలో ఇంటికి ఒంటరిగా వెళ్తూండగా, పబ్లిక్ గార్డెన్స్ దగ్గర తాగి ఉన్న నలుగురు యువకులు ఆమె ప్రయాణించే ఆటోని బలవంతంగా ఆపి దాన్ని లోపలికి తీసుకెళ్ళి లాన్‌లో బలాత్కారం చేసారు. ఈ సంగతి ఆటో డ్రైవరు ద్వారా తెలుసుకున్న కొందరు పాదచారులు లోపలికి వెళ్ళారు. అయితే ఆ నలుగురు వీళ్ళ రాకని చూసి పారిపోయారు. నాంపల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అబ్బాస్ సమాచారం అందుకుని హుటాహుటిన వచ్చి ప్రమీలని ఉస్మానియా హాస్పిటల్‌కి తరలించాడు. నిందితులకి చెందిన కొన్ని క్లూలు పోలీసులకి దొరికాయి. కేసు విచారణలో ఉంది. అయితే ఆ సమయంలో మూసి ఉండాల్సిన పబ్లిక్ గార్డెన్స్ గేటు ఎందుకు తెరిచి ఉంది? అన్న ప్రశ్నకి సమాధానం దొరకాల్సి ఉంది.

ఆ వార్తలో ఫోటోలు లేవు. 'నాంపల్లి సి.ఐ. అబ్బాస్' అని చిన్న పుస్తకంలో రాసుకున్నాడు త్రివిక్రం.

మర్నాటి దినపత్రికని చదివాడు. ఆ వార్త మొదటి పేజీలోనే వేసారు. అందులో ఆ నలుగురు రేపిస్ట్‌ల పేర్లు ఉన్నాయి. అంతా వివేకవర్ధని కాలేజీలో బి.ఏ చదివే విద్యార్థులు. అబిడ్స్‌లోని రెడ్డి హాస్టల్‌లో బస. ఆ పేర్లని తన బుక్‌లో రాసుకున్నాడు త్రివిక్రం.

నవనీత్(19) అలెగ్జాండర్ (18), కురంగేశ్వర్ (19), హరినాథ్ (18)

'తన తండ్రి పేరు మొదటిసారిగా తను రాసాడు' అనుకున్నాడు త్రివిక్రం. ఆ నలుగురిలో ఒకరు తన తండ్రి. అతను ఎవరో తెలుసుకోవాలి.

సంఘటనా స్థలంలో దొరికిన ఓ బస్ పాస్ ఆధారంగా పోలీసులు ఆ నలుగురు నిందితుల్ని కనుక్కోగలిగారని, వారంతా వివేకవర్ధని కాలేజీలో బి.ఏ చదివే విద్యార్థులని, నవనీత్ పుట్టిన రోజుకి అంతా నాంపల్లి సర్కిల్‌లోని ఓ బార్‌లో మద్యం తాగారని, బాగా

తాగి గొడవ చేయడం వల్ల ఆ నలుగుర్ని బార్‌లోంచి బలవంతంగా బయటికి పంపించారని, బయటికి వచ్చాక ఇది జరిగిందని ఆ వార్త ద్వారా త్రివిక్రంకి తెలిసింది.

ఫిబ్రవరి పదకొండో తారీఖు దినపత్రికలో కూడా మొదటి పేజీలోనే ఉందా వార్త. ఈసారి నిందితుల్లో నవనీత్‌కి బెయిల్ దొరికి బయటికి వచ్చాడని, అతని తండ్రి గోవర్ధన్ బాలానగర్‌లో హెచ్.ఎం.టికి విడిభాగాలని సప్లై చేసే ఏన్సిలరీ ఇండస్ట్రీని నడుపుతున్నాడన్న అదనపు సమాచారం ఉంది. మరో నిందితుడు హరినాథ్ తండ్రి కరీంనగర్ రేంజ్‌లో పనిచేసే అడిషనల్ డి.ఐ.జి రఘునాథ్ అని, మిగిలిన ఇద్దరిలో కురంగేశ్వర్ తండ్రి సిద్దిపేటలో చిన్న కిరాణా దుకాణం నడిపే సాంబశివుడు అని, నాలుగో నిందితుడు అలెగ్జాండర్‌కి తండ్రిలేడని, తల్లి మరియమ్మ కర్నూల్‌లోని కలెక్టరేట్‌లో యు.డి.సిగా పనిచేస్తోందని కొత్త వివరాలు దొరికాయి. వాటన్నిటినీ త్రివిక్రం తన నోట్ బుక్‌లో రాసుకున్నాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

www.anandbooks.com
www.telugubooks.in